# నిజాలు తేలాలి.. నీళ్లు రావాలి!

రేపు బీఆర్ఎస్ కాళేశ్వర యాత్ర • స్వాగతిస్తున్న తెలంగాణ సమాజం

**ఏం జరిగింది.. ఏం జరుగుతున్నది?**

**వేలకోట్ల ప్రాజెక్టును వదిలేద్దామా?**

- పర్యవసానాలేంది?.. భవిష్యత్తు ఏమిటి?
- తెలంగాణ ప్రజల మదిలో సవాలక్ష ప్రశ్నలు
- కార్యరంగంలోకి దిగిన బీఆర్ఎస్
- నిజనిర్ధారణ జరగాల్సిందేనని స్పష్టీకరణ
- పునరుద్ధరించుకోవాలి: వీ ప్రకాశ్
- ప్రాజెక్టు ప్రజల ఆస్తి: ఘంటా చక్రపాణి



కాళేశ్వరంపై రూపొందించిన కరపత్రాన్ని సిరిసిల్లలో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్, పెద్దపల్లి జడ్పీచైర్మన్ పుట్ట మధూకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో నిజంగా ఏం జరిగింది? ఏ మేరకు నష్టం వాటిల్లింది? ఏం జరుగుతున్నది? ప్రాజెక్టు పనికిరాదా? లక్షల కోట్లు వృథాయేనా? ప్రాజెక్టును పునరుద్ధరించుకోవచ్చా?' ఇవి యావత్ తెలంగాణ సమాజం మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న ప్రచారంలో వాస్తవమెంతా? తక్షణ కర్తవ్యం ఏంటి?' అనే వాటిపై చర్చించాలనేది తెలంగాణ ఉద్యమకారులు, మేధావుల డిమాండ్. తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా గత మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా ఇదే చర్చ. కాళేశ్వరం ప్రాజెక్టుపై అనేక అపోహలు. అసత్య ప్రచారాలు. సరిగ్గా అలాంటి తరుణంలోనే బీఆర్ఎస్ పార్టీ 'చలో మేడిగడ్డ' పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ నిర్ణయంపై విశ్రాంత ఇంజినీర్లు, తెలంగాణ ఉద్యమకారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రాజెక్టుపై నిజనిర్ధారణ జరగాలని, వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టును పునరుద్ధరించి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు.

### కాంగ్రెస్, పలు పార్టీల నేతల బృందం సందర్శన

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో 7వ బ్లాక్‌లోని 20వ నంబర్ పిల్లర్ గత అక్టోబర్‌లో కుంగుబాటునకు గురవ్వడంతో మొత్తం ప్రాజెక్టుపైనే అనుమానాలు రేకెత్తేవిధంగా ప్రచారం కొనసాగుతున్నది. కుంగుబాటునకు కారణాలను అన్వేషించకుండా, పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండా, అవి పూర్తయి నివేదికలు రాకముందే ఒకవైపు ఎన్‌డీఎస్‌ఏ, మరోవైపు విజిలెన్స్ బృందం ప్రాజెక్టుపై పుకార్లకు ఊతమిచ్చేలా నివేదికలను విడుదల చేస్తున్నాయి. వాటిని సాకుగా చూపుతూ కాంగ్రెస్ ప్రభు త్వం అదే తరహా ప్రచారానికి తెరలేపింది. తొలుత రాష్ట్ర మంత్రుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఒకసారి, ఆ తర్వాత మరోసారి మంత్రులు, కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేల బృందంతో ప్రాజెక్టును విజిట్ చేశారు. మళ్లీ అవే ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ నివేదికలను బయటపెట్టారు తప్ప ప్రాజెక్టు ఘటనకు సంబంధించి, ప్రస్తుతం చేపట్టాల్సిన పనుల గురించి ఏ వివరాలూ వెల్లడించలేదు. 20వ పిల్లర్ ఫొటోలనే మీడియాకు విడుదల చేస్తూ సమాజాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు.

### ప్రాజెక్టు ప్రజల ఆస్తి

రాజకీయాలు ఎలా ఉన్నా ప్రాజెక్టు అనేది ప్రజల ఆస్తి. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది, గోదావరి జలాలను మళ్లించింది, తద్వారా చివరి మడి వరకు తడి అంది పంటలు పండింది వాస్తవం. ఇప్పుడు అలాంటి భారీ ప్రాజెక్టులో ఒక భాగమైన బరాజ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. ప్రభుత్వం పునరుద్ధరణ చర్యలు చేపట్టకుండా కాళేశ్వరం ప్రాజెక్టునే బద్నాం చేసేందుకు యత్నిస్తున్నది. వాస్తవంగా ప్రాజెక్టులో జరిగింది ఏమిటి? కుంగుబాటుకు కారణాలు ఏమిటి? తక్షణం చేపట్టాల్సిన నివారణ చర్యలు ఏమిటి? శాశ్వత పరిష్కారమార్గాలు ఏమిటి? ప్రాజెక్టును తిరిగి ఎలా వినియోగంలోకి తీసుకువస్తారు? అనే అంశాలపై చర్చ కొనసాగుతున్నది. ఆయా అంశాలపై రాజకీయాలకతీతంగా, రైతాంగం, సమాజ సంక్షేమం దృష్ట్యా నిజనిర్ధారణ కొనసాగాలని తెలంగాణ మేధావి వర్గం, పౌర, ప్రజాసంఘాలు, ఇంజినీరింగ్ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ చలో మేడిగడ్డకు పిలుపునివ్వడం పట్ల అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయి.

### రేపు బీఆర్ఎస్ బృందం సందర్శన

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం మేడిగడ్డను సందర్శించనున్నది. ఈ బృందం ఉదయమే తెలంగాణభవన్ నుంచి బయలుదేరనున్నది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్యనాయకులు తరలివెళ్లనున్నారు. దాదాపుగా 150 నుంచి 200 మంది వరకు బృందంలో ఉంటారని అంచనా. మీడియా ప్రతినిధులను, నిపుణులను తీసుకెళ్లనున్నారు. మేడిగడ్డ బరాజ్‌పై ప్రభుత్వ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మేడిగడ్డ పర్యటనను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వెళ్తున్నారు.

### నేడు విశ్రాంత ఇంజినీర్ల సమావేశం

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, ప్రాజెక్టు పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం నిర్ణయించింది. దీనిపై శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించనున్నది.

### ఉద్యమ ఫలాలను కాపాడుకోవాలి



**కాళేశ్వరం** అంటే మేడిగడ్డ ఒక్కటే కాదు. 40 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే ఇంటిగ్రేటెడ్ నిర్మాణ సమూహం. కేసీఆర్‌పై కక్షతో ప్రాజెక్టును బలి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బలిచేస్తే నాటి కరువు పరిస్థితులనే తెలంగాణ చవిచూడాల్సి వస్తుంది. ఉద్యమ ఫలాలను తెలంగాణ కాపాడుకోవాలి. కేటీఆర్, హరీశ్‌రావు ప్రాజెక్టు సందర్శనకు నడుంకట్టడం అభినందనీయం.

–వీ ప్రకాశ్, మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్

### నిజనిర్ధారణ జరగాలి



**మేడిగడ్డ** ప్రాజెక్టును కాపాడటం ప్రాథమిక అంశం. అవినీతి, విచారణ మరొక అంశం. ఆ రెండింటిని వేరు చేసి చూడాలి. ప్రాజెక్టుపై నిజనిర్ధారణ జరగాల్సిందే. ప్రాజెక్టు కట్టింది నిజం. నీళ్లు పారించింది నిజం. పంటలు పండింది నిజం. కానీ రాజకీయాల కోసం ప్రాజెక్టును వాడుకోవద్దు. ప్రాజెక్టు పునరుద్ధరణపై తక్షణ చర్యలు చేపట్టాలి.

– ఘంటా చక్రపాణి, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్

## మేడిగడ్డను రిపేర్ చేస్తాం: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి28 (నమస్తే తెలంగాణ): ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు, సూచనలు చేసిన అనంతరం మేడిగడ్డ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మరమ్మతులు చేపట్టిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆనకట్టలు, పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకువస్తామని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ 'చలో మేడిగడ్డ' పిలుపు రాజకీయ గిమ్మిక్కు అని విమర్శించారు. జలసౌధలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే బీఆర్ఎస్ నేతలకు అన్నీ చూపాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఐదేండ్లపాటు 65 టీఎంసీల నీటితో 6.5 లక్షల ఆయకట్టును స్థిరీకరించారని చెప్పారు.ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు.



బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ'కు అనుమతి ఇవ్వాలని కోరుతూ డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతితో కూడిన పార్టీ ప్రతినిధుల బృందం

## బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ'కు అనుమతి ఇవ్వండి

డీజీపీకి రూట్‌మ్యాప్ అందజేసిన పార్టీ ప్రతినిధి బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మార్చి 1న నిర్వహించ తలపెట్టిన 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని, బందోబస్తు కల్పించాలని ఆ పార్టీ ప్రతినిధి బృందం డీజీపీ రవిగుప్తాను కోరింది. బుధవారం ఈ మేరకు డీజీపీని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, పార్టీ నేతలు నాయినేని రాజేశ్వర్‌రావు, రాఘవ తదితరుల బృందం కలిసి వినతిపత్రం, హైదరాబాద్ నుంచి మేడిగడ్డ వరకు చేసే రూట్ మ్యాప్‌ను అందజేసింది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ బృందం ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి, ఆలేరు, జనగామ, వరంగల్, పరకాల, భూపాలపల్లి (మధ్యాహ్న భోజనం) మేడిగడ్డకు చేరుకొంటున్నదని పార్టీ నేతలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు బీఆర్ఎస్ పకడ్బందీ కార్యాచరణ రూపొందించింది. పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, సాగునీటి రంగ నిపుణులు ఈ బృందంలో పాల్గొననున్నారు. కాగా, బీఆర్ఎస్ చేపట్టిన 'చలో మేడిగడ్డ' కార్యక్రమానికి అవసరమైన చర్యలు తీసుకొంటామని డీజీపీ తమకు హామీ ఇచ్చినట్టు పార్టీ ప్రతినిధులు తెలిపారు.



ఇల్లంతకుంటలో ధర్నా చేస్తున్న రహీంఖాన్‌పేట రైతులు

## పంటలకు నీళ్లివ్వాలని రైతుల ధర్నా

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28: ఆరుగాలం కష్టించి సాదుకుంటున్న పంటలు నీరు లేక కండ్ల ముందే ఎండిపోతున్నాయని, ప్రభుత్వం తమ గోడును అర్థం కేసుకుని వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు నిత్యం రోడ్డెక్కుతున్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో రైతులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా అన్నదాతలు మాట్లాడుతూ.. గతంలో ప్రతి యాసంగి పంటకు నీళ్లిచ్చేందుకు అన్నపూర్ణ ప్రాజెక్టు ద్వారా అనంతారం చెరువును కాళేశ్వరం జలాలతో నింపేవారని, తర్వాత బిక్కవాగు నుంచి పిల్ల కాలువ ద్వారా రహీంఖాన్‌పేట చెరువును నింపేవారని గుర్తుచేశారు. ఏటా నీళ్లు రావడంతో సాగుకు ఇబ్బంది కాలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిందని, పంటలకు నీళ్లు రావడం లేదని వాపోయారు. గ్రామంలో 3 వేల ఎకరాల వరకు వరి ఆయకట్టు ఉందని, ఇప్పటికే 500కుపైగా ఎకరాలు ఎండిపోయాయని కన్నీటిపర్యంతమయ్యారు. ముందు నీళ్లివ్వకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో రైతులకు సాగునీటి కష్టాలు చూడలేదని, సంబురంగా సాగు చేసుకున్నామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీటి కోసం అరిగోస పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సాగునీటిని విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే పంటలు ఎండిపోయి.. పెట్టిన పెట్టుబడి రాక.. అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందని హెచ్చరించారు.



## నేడు మీడియా అకాడమీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన కే శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను హైదరాబాద్ బషీర్‌బాగ్ పాత ప్రెస్‌క్లబ్‌లోని సూరవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఒకే ఇంట్లో 662 ఓట్లు!

సాక్ష్యాలున్నయ్: ఫిరోజ్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 28: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని యాకుత్‌పురాలోని ఒకే ఇంటిలో 662 మంది ఓటర్లు ఉన్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ ఆరోపించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. దీనికి సంబంధించిన అన్ని సాక్ష్యాలూ తన వద్ద ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రధానంగా మలక్‌పేట, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చంద్రాయన్‌గుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురాలో అత్యధికంగా బోగస్, డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని ఆరోపించారు. ఈ బోగస్, డూప్లికేట్ ఓటర్లే ఎంఐఎం పార్టీకి బలమని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు సకాలంలో బోగస్ ఓట్లును తొలగిస్తే లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 16.4°c | 38.5°c |
| రంగారెడ్డి | 16.6°c | 38.0°c |
| మెదక్ | 18.4°c | 36.2°c |
| హైదరాబాద్ | 19.0°c | 34.0°c |
| ఖమ్మం | 21.0°c | 36.0°c |
| వరంగల్ | 21.5°c | 34.5°c |
| నిజామాబాద్ | 21.6°c | 35.6°c |
| మహబూబ్‌నగర్ | 22.1°c | 36.5°c |
| నల్లగొండ | 23.4°c | 36.9°c |
| కరీంనగర్ | 23.0°c | 34.0°c |



సిద్దిపేట జిల్లాలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వివరాలు నమోదు చేస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగి

## ఉపాధిహామీ ఉద్యోగుల పస్తులు

మూడు నెలలుగా అందని వేతనాలు • భారంగా మారిన కుటుంబ పోషణ

వేతనాల కోసం 12,660 మంది ఎదురుచూపులు

సిద్దిపేట, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రాక పస్తులు ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారికి వేతనాలే ఇవ్వలేదు. మార్చి నెల కూడా రానే వచ్చింది. ఇది కలుపుకొంటే నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉంటాయి. రాష్ట్రంలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన 12,660 మందికి జీతాలు రావాల్సి ఉన్నది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం కొంత ఆలస్యమైనా ఏ నెల వేతనాలు ఆ నెల వేసింది. కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలుగా వేతనాలు వేయకపోవడంతో ఇబ్బందిగా ఉన్నదని ఉద్యోగులు వాపోతున్నారు.

### 12,660 మందికి అందని వేతనాలు

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న దాదాపు 12,660 మంది ఉద్యోగులకు జీతాలు రాక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతాలు, ఇతర అవసరాలకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఏ నెలకు ఆ నెల సరిపడా బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్నది. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా పస్తులు ఉంచింది. 2023 డిసెంబర్‌లో 10,632 మందికి, ఇందులో టెక్నికల్ అసిస్టెంట్లు 2028 మందికి మొన్నటి శనివారం రోజున జీతాలు వేసింది. మిగిలిన 10,430 మంది జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2024 జనవరిలో 12,660 మంది, ఫిబ్రవరిలో 12,660 మందికి జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మార్చి నెల రానే వచ్చింది. ఈనెల కలిపితే నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లోనే ఉన్నట్టు. రాష్ట్రంలో 3,974 మందిలో ఏపీవోలు 392 మంది, ఈసీలు 289, సీవో, ఏఎలు 870 మంది, టీఏలు 2028 మంది, అడిషనల్ డీఆర్పీలు 8 మంది, సీడీ సీఎల్‌ఆర్ 17 మంది, జేఈ(సివిల్) 60 మంది, ప్లాంటేషన్ సూపర్‌వైజర్స్ 26 మంది, పీవోలు 23 మంది, ఇతర విభాగాలకు చెందిన వారు 261 మంది ఉన్నారు. మొత్తం అన్ని విభాగాలు కలిపి 12,660 మంది పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. వచ్చే వేతనాలు తెచ్చిన అప్పులకు వడ్డీలకే సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వాలని ఉపాధి హామీ ఉద్యోగులు కోరుతున్నారు.

## ఒకటో తేదీన వేతనాలు అబద్ధం

- మాట తప్పిన కాంగ్రెస్
- సమగ్రశిక్ష ఉద్యోగుల పెండింగ్ జీతాలను చెల్లించండి
- ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆచరణలో మాత్రం మాట తప్పిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గత ఏడాది డిసెంబర్ నెలకు సంబంధించి 10,632 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి 12,660 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు అందలేదని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు 3 నెలల నుంచి వేతనాలు, మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట ఛార్జీలు, కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కరీంనగర్‌లో పోలీస్ రాజ్యం

మొదటిపేజీ తరువాయి...

గ్రామ పంచాయతీ శివారులో 2004లో సర్వేనంబర్ 240/ఎలో 555.97 చదరపు గజాలు, 2005లో 189 గజాల మొత్తం విస్తీర్ణం 744.97 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్టు రవీందర్‌రెడ్డి తెలిపారు. 2017లో ఆ స్థలానికి తీగలగుట్టపల్లి గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకొని ప్రహరీ, షెడ్డు నిర్మించుకున్నట్టు తెలిపారు. ఇదే సర్వే నంబర్‌లో 1.20 ఎకరాల భూమిని మూల అరుణాదేవి కొనుగోలు చేయగా, వాటిని 26 ప్లాట్లు చేసి విక్రయించారని, వాటిని కొనుగోలు చేసిన వారు స్థానికంగా లేకపోవడంతో మాజీ జడ్పీటీసీ కాశెట్టి శ్రీనివాస్ తమ వద్దకు వచ్చి కొనుగోలు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలంటే.. డబ్బు ఇవ్వాలని బెదిరించినట్టుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము స్పందించకపోవడంతో చుట్టుపక్కల కాలనీవాసులను ప్రోత్సహించి ప్లాట్ల రోడ్డుపైనే శవాలను ఖననం చేయించారని, ఇది శ్మశానవాటిక కాదని తాము చెప్పడంతో పాటు ఇదే విషయాన్ని కాశెట్టి శ్రీనివాస్ వద్దకు వెళ్లి అడిగామని, తాను డిమాండ్ చేసిన డబ్బు ఇవ్వలేదు కాబట్టి ప్లాట్లు మీకు కాకుండా చేస్తానని చెదిరించినట్టుగా ఆ ఫిర్యాదులో తెలిపారు.

అలాగే 2019 జనవరి 2న కిసాన్‌నగర్ మాజీ కార్పొరేటర్ ఎడ్ల అశోక్‌తోపాటు మాజీ వార్డు మెంబర్ అల్లబిల్లి నగేశ్ తదితరులు కొందరు కలిసి వచ్చి తాను నిర్మించుకున్న ప్రహరీతోపాటు షెడ్డును జేసీబీతో కూల్చి వేశారని, ఇదేమిటని అడిగితే.. ఇది ప్రభుత్వ భూమి.. ఇక్కడి నుంచి వెళ్లకపోతే గడ్డపారతో పొడిచి చంపుతామని బెదిరించారని, ఆ సమయంలో ఎడ్ల అశోక్‌కు భయపడి ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

2019 మార్చి 19న తీగలగుట్టపల్లి పంచాయతీ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత తిరిగి కాశెట్టి శ్రీనివాస్, తుల బాలయ్య, ఎడ్ల ఆశోక్ తమ ప్లాట్ల యాజమానులను పిలిపించి.. 240/ఎ సర్వే నంబర్‌లోని భూమి కార్పొరేషన్‌లో కలిసిందని, ప్లాట్‌కు రూ.3 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఇవ్వని పక్షంలో ఆ భూమిని ప్రభుత్వ భూమిగా మార్చి అక్కడ శ్మశానవాటిక ఏర్పాటు చేస్తామని బెదిరించారని, తనతోపాటు ప్లాట్ కొన్న గాలిపెల్లి రాజమౌళి, ఏలేటి రఘుపతిరెడ్డి ఒక్కొక్కరం లక్ష చొప్పున మొత్తం రూ. 3 లక్షలను ఎడ్ల అశోక్‌కు ఇచ్చినట్టుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. తర్వాత ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారంతో అక్కడ ప్రభుత్వ భూమి లేదని తెలుసుకున్నామని చెప్పారు. కొద్దిరోజుల తర్వాత మళ్లీ మిగిలిన డబ్బు ఇవ్వాలంటూ తమను బెదిరించారని, ఇవ్వకపోతే మళ్లీ బెదిరించారని, దీంతో తాను కోర్టును ఆశ్రయించి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించామని తెలిపారు. ప్లాట్‌కు రూ.3 లక్షలు వసూలు చేయాలన్న దురుద్దేశంతో తమను ఇబ్బంది పెట్టడంతోపాటు ప్రహరీ, షెడ్డును కూల్చి బెదిరింపులకు పాల్పడుతున్న కాశెట్టి శ్రీనివాస్, ఎడ్ల అశోక్, తుల బాలయ్య, అల్లిబిల్లి నగేశ్, శివరాత్రి సమ్మయ్యతోపాటు తదితరులపై చర్యలు తీసుకోవాలని తాజా ఫిర్యాదులో కోరారు.

### కోర్టులో కొనసాగుతున్న సివిల్ దావా

ప్రస్తుతం ఫిర్యాదు చేసిన మామిడి రవీందర్‌రెడ్డి (సతీమణి మామిడి పుష్పలత)తోపాటు తాజా ఫిర్యాదులో ఒక్కొక్కరు లక్ష ఇచ్చినట్టుగా చెప్తున్న గాలిపెల్లి రాజమౌళి, ఏలేటి రఘుపతిరెడ్డితో కలసి మొత్తం తొమ్మిది మంది 2019 డిసెంబర్ 12న కరీంనగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సివిల్ దావా (ఓఎస్ నంబర్474/2019) వేశారు. ఆ దావాలో ఎడ్ల అశోక్‌తోపాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్, తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీని ప్రతివాదులుగా చేర్చారు. కానీ, ఈ దావాలో ఎక్కడా కూడా కాశెట్టి శ్రీనివాస్, తుల బాలయ్య పేరు ప్రస్తావనే లేదు. 2019 మార్చి 19న తీగలగుట్టపల్లి కరీంనగర్ కార్పొరేషన్‌లో కలిసిందని, ప్లాట్‌కు మూడు లక్షలు ఇవ్వాలని కాశెట్టి శ్రీనివాస్, ఎడ్ల అశోక్, తుల బాలయ్య అడిగారని ఫిర్యాదు చేసిన వ్యక్తులు.. 2019 డిసెంబర్‌లో కోర్టులో వేసిన దావాలో మాత్రం ఆ వివరాలను ఎందుకు చేర్చలేదన్నది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రశ్న. అలాగే ఎడ్ల ఆశోక్ కన్నా ముందుగానే.. కాశెట్టి శ్రీనివాస్ డబ్బు కోసం బెదిరించారని తాజా ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ కోర్టు దావాలో మాత్రం కాశెట్టి పేరుగానీ, తుల బాలయ్య పేరును గానీ ఎక్కడా ప్రస్తావించలేదు. కనీసం వారు బెదిరించినట్టుగా చెప్పలేదు. అలాగే కోర్టు దావాలో ఎడ్ల అశోక్‌తోపాటు మున్సిపల్ అధికారులు వచ్చి తన షెడ్డు, ప్రహరీని కూల్చి వేశారని చెప్పిన వ్యక్తులు.. ఇప్పుడు ఎడ్ల అశోక్ ఇంకా కొంత మందిని తీసుకొచ్చి కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తాజా ఫిర్యాదులో ఈ వివాదంపై కోర్టులో దావా నడుస్తున్నట్టుగా ఎక్కడా పోలీసులకు వివరాలు ఇచ్చినట్టుగా దాఖలాలు లేవు.

### అనుమానాలు.. ఎన్నెన్నో సందేహాలు

ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే? కోర్టులో ఫైల్ చేసిన కేసు నిజమా? లేక తాజా ఫిర్యాదు నిజమా? ఏది నిజం? ఏది అబద్ధం? అన్నదానిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. అంతేకాదు ప్రస్తుతం కోర్టులో ఉన్న కేసు తదుపరి విచారణ వచ్చే నెల మార్చి16న ఉన్నది. ఈ విషయాన్ని పోలీసులు ఏమాత్రం పరిగణనలోకి తీసకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. 2019 మార్చి 7న సర్వే చేయించారు. దీంతో అక్కడ ప్రభుత్వ భూమి లేదని తెలిసింది. ఈ విషయాన్ని ఫిర్యాదులోనే ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

### పోలీసులకు కోర్టులో ఎదురుదెబ్బ

**మామిడి** రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపిన పోలీసులకు బుధవారం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో 386, 452, 427, 506, 120–డీఆర్/డబ్ల్యు 34 ఐపీసీ కింద నిందితులుగా కాశెట్టి శ్రీనివాస్, ఎడ్ల అశోక్, తుల బాలయ్యతోపాటు పలువురిపై కేసు నమోదు చేసి బుధవారం కరీంనగర్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి షరినా ముందు హాజరుపర్చారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన మెజిస్ట్రేట్ ఈ కేసులో ఇప్పటికే కోర్టులో సివిల్ దావాతోపాటు ప్రైవేట్ ఫిర్యాదు దాఖలై ఉన్నదని, ఈ కేసులో నిందితులకు 386 సెక్షన్ వర్తించదని కోర్టు చెప్పింది. కోర్టు ఆదేశాల తో నిందుతులకు నోటీసులు ఇచ్చి విడుదల చేశారు.



ఆత్మకూరులో మీడియాతో మాట్లాడుతున్న బాధిత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

## కాంగ్రెసోళ్లు, పోలీసులు కుమ్మక్కైండ్రు

- ఆత్మకూరు బాధిత బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 28 : కాంగ్రెసోళ్లు, పోలీసులు కుమ్మక్కై తమపై తప్పుడు కేసులు నమోదు చేశారని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో పోలీస్ బాధిత బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమను నాలుగు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పి విచక్షణారహితంగా చితకబాధారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మక్క–సారలమ్మ దేవతల సాక్షిగా తాము తప్పులు చేయలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి వస్తున్నారని వెళ్లామని,. జై తెలంగాణ, జై చల్లా అనే నినాదాలు చేశామని తెలిపారు. కావాలంటే జాతర సీసీ కెమెరాలను పరిశీలించాలని కోరారు. సమావేశంలో బాధిత బీఆర్ఎస్ నాయకులైన వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, రేవూరి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నేరెళ్ల కమలాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల శ్రీనివాస్, వంచ సాంబశివరెడ్డి, కాంతాల రవీందర్‌రెడ్డి, వేల్పుల గణేశ్, రేగుల కిషోర్ పాల్గొన్నారు.

**నిపుణ** విద్య, ఉద్యోగ సమాచారం

## నేవీలో 242 పోస్టులు...

**కేరళ ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో షార్ట్ సర్వీస్ కమిషన్ జనవరి-2025 ప్రారంభమయ్యే కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 242
- షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్– జనవరి 2025 కోర్సు
- బ్రాంచ్ వివరాలు: జనరల్ సర్వీస్ పైలట్ లాజిస్టిక్స్, ఎడ్యుకేషన్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: మార్చి 10
- వెబ్‌సైట్:https://www.joinindiannavy. gov.in

## ఎయిమ్స్‌లో...

**న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్ ప్రకటన విడుదలైంది.**

- పోస్టులు: నర్సింగ్ ఆఫీసర్
- ఎంపిక: నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 17
- వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

## ఎంజీయూలో పీహెచ్‌డీ...

**నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది.**

- పీహెచ్‌డీ ప్రోగ్రాం (2022–23, 2023–2024)
- సబ్జెక్టులు: కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరి తేదీ: మార్చి 13
- వెబ్‌సైట్:https://www.mguniversity.ac.in

## ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ స్టడీస్ (గ్రూప్స్), ఇంటర్ మ్యాథ్స్ మొదటి సంవత్సరం మోడల్ పేపర్–బీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.